క్లుప్తంగా

'మాగంటి' లేని లోటు తీరనిది



గోపినాథ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

కడ్తాల్: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ మృతికి బీఆర్ఎస్ నాయకులు సంతాపం తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పార్టీ అభివృద్ధికి మాగంటి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఆయన లేని లోటు తీరనిదన్నారు. సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, నాయకులు లచ్చిరామ్‌నాయక్, లాయక్‌అలీ, పాండు, చంద్రయ్య ఉన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



తరుణ్‌కు ఫోన్ అందజేస్తున్న ఎస్‌ఐ వెంకటేశ్

ఆమనగల్లు: సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితుడికి పోలీసులు ఫోన్ అప్పగించారు. ఆమనగల్లు మండలం శంకరకొండతండా పరిధి దయ్యాలబోడుతండాకు చెందిన తరుణ్.. ఇటీవల పట్టణంలో సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. దీంతో సదరు వ్యక్తి, ఆమనగల్లు ఠాణాలో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కానిస్టేబుల్ రఘునాయక్.. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్ ఆచూకీ కనుగొన్నారు. అనంతరం ఆదివారం పోలీస్ స్టేషన్లో ఎస్‌ఐ వెంకటేశ్.. బాధితుడికి మొబైల్‌ను అప్పగించారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

ఆమనగల్లు: ఆమనగల్లు మేజర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ యాదయ్య తండ్రి, వార్డు మాజీ సభ్యుడు గోరటి జంగయ్య అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. ఈ మేరకు మృతుడి కుటుంబాన్ని, ఆదివారం జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కండె హరిప్రసాద్, బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు విక్రంరెడ్డి తదితరులు పరామర్శించారు.

మంత్రి 'వాకిటి'కి శుభాకాంక్షలు



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

కడ్తాల్: మంత్రి వర్గంలో చోటు దక్కించుకుని, ఆదివారం రాజ్‌భవన్‌లో ప్రమాణస్వీకారం చేసిన మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి కాంగ్రెస్ శ్రేణులు శుభాకాంక్షలు తెలిపారు. యూత్ కాంగ్రెస్ కల్వకుర్తి నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షాబుద్దీన్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి పి.రాహుల్‌లు మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా పోచమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠాపన

కందుకూరు: మండల పరిధిలోని లేమూరులో పోచమ్మతల్లి విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య విగ్రహ ప్రతిష్ఠ పూజల అనంతరం హోమం, అమ్మవారి కల్యాణం నిర్వహించారు. గ్రామస్తులు పాల్గొని అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కాగా మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణనాయక్, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాణాప్రతాప్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొని పూజలు చేశారు. వీరికి ఆలయ నిర్వాహకులు మెమొంటోలు అందించి సన్మానించారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

కొందుర్గు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ సోషల్ మీడియా కన్వీనర్ సాల్కమ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం చౌదరిగూడ ఆర్య సమాజంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యవర్గ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీని మరింత పటిష్టం చేయాలని సూచించారు. కార్యకర్తలందరూ సైనికుల్లా పనిచేసి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో జెండా ఎగురవేయాలన్నారు. అనంతరం మొక్కలు నాటారు.

గడువిచ్చినా.. ఫలితం అంతంతే!

మొత్తం 14,100 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు

- 4,124 అర్జీలు క్లియర్
- ఆదాయం రూ.10.69 కోట్లు
- స్పందించని 70 శాతం మంది ప్లాట్ల యజమానులు



ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయం

ఇబ్రహీంపట్నం: అక్రమ లే అవుట్ ప్లాట్ల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్)కు 25 శాతం రాయితీతో కూడిన ఫీజు చెల్లింపునకు ప్రభుత్వం మూడు నెలలు గడువు ఇచ్చింది. అయినా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో ఆశించిన స్థాయిలో ఫలితం రాలేదు. తొలుత మార్చి ఫస్టు నుంచి మే 31 వరకు గడువును మూడుసార్లు(ఈ మధ్యకాలంలో) పొడిగిస్తూ రుసుం చెల్లించేందుకు దరఖాస్తుదారులకు ప్రభుత్వం వెసులుబాటును కల్పించింది. అయినప్పటికీ.. ప్లాట్ల యజమానుల నుంచి స్పందన అంతంత మాత్రమే వచ్చింది.

14,100 దరఖాస్తులు

2020 నాటికి దరఖాస్తు చేసుకున్న వారి ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇందులో భాగంగా పురపాలక సంఘం పరిధి నుంచి 14,100 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు వచ్చాయి. రద్దీ అధికంగా ఉంటుందని భావించిన అధికారులు.. మున్సిపల్ కార్యాలయంలో నాలుగు కౌంటర్లను ఏర్పాటు చేశారు. కానీ.. కేవలం 4,124 ప్లాట్ల యజమానులు మాత్రమే ఫీజు చెల్లించి, క్రమబద్ధీకరించుకున్నారు.

ఆశించింది రూ.60 కోట్లు

ఎల్ఆర్ఎస్ ఫీజు రూపేణా మున్సిపాలిటీకి రూ.55 నుంచి 60 కోట్ల వరకు ఆదాయం సమకూరుతుందని అధికార యంత్రాంగం ఆశించింది. ప్లాట్ల దారుల నుంచి సరైన స్పందన లేని కారణంగా వారి ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. కేవలం 29.25 శాతం ప్లాట్ల యజమానుల చెల్లింపుతో రూ.10.69 కోట్లు మాత్రమే వచ్చాయి. మరో 70 శాతం మంది ముందుకు రాకపోవడం గమనార్హం.

మరోసారి..

మొదట్లో సాంకేతిక, అవగాహన లోపంతో ఎల్ఆర్ఎస్ ప్రక్రియలో కొంత జాప్యం జరిగింది. వీటన్నంటిని దృష్టిలో పెట్టుకొని మరో మూడు సార్లు ప్రభుత్వం గడువు పెంచింది. మే నెల 31తో ముగిసింది. ఆశించినట్లుగా అర్జీ దారులు ముందుకు రాకపోవడంతో మరోసారి అవకాశం కల్పించేందుకు మరోదఫా గడువును పెంచాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. రెండుమూడు రోజుల్లో ఈ ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని చెబుతున్నారు. మరో అవకాశం ఇస్తారా లేదా వేచి చూడాల్సిందే!

తరువాత చూద్దాంలే..

ఫీజు అధికంగా ఉందని కొందరు, ఆర్థిక పరిస్థితుల కారణంతో ఇంకొందరు, లేదా ఫీజు ఇప్పుడేందుకు, తరువాత చూద్దాంలే అని మరికొందరు అర్జీ దారులు ముందుకు రాకపోవడంతో ఆదాయం తగ్గడానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. అప్పుడైతే దరఖాస్తు చేసుకున్నాం. నిర్మాణ సమయంలో ఫీజు చెల్లిద్దామని, ప్రభుత్వం ఇచ్చే 25 శాతం రాయితీకి ఆశ పడకపోవడం కూడా మరో కారణం కావచ్చు. నాడు దరఖాస్తు చేసుకున్నవారిలో పలువురు ఈ మధ్య కాలంలో ప్లాట్లను విక్రయించుకోవడంతో ఆశించిన మేర ఫలితం రాలేదని చెప్పవచ్చు.

పొడిగించే అవకాశం



ఎల్ఆర్ఎస్ గడువును పొడిగించే అవకాశం ఉంది. మున్సిపాలిటీలో 30 శాతం ప్లాట్ల దరఖాస్తుదారులు మాత్రమే ఫీజు చెల్లించారు. సుమారు రూ.10.69 కోట్ల ఆదాయం వచ్చింది. పలు కారణాలతో 70శాతం మంది ముందుకు రాలేదు. మళ్లీ అవకాశం ఇస్తే ఆదాయం పెరగవచ్చు.

– రవీంద్రసాగర్, మున్సిపల్ కమిషనర్, ఇబ్రహీంపట్నం

బాబోయ్.. భౌభౌలు

- గుంపులుగా గ్రామసింహాల సంచారం
- భయాందోళనలో ప్రజలు



ఆమనగల్లు వీధుల్లో కుక్కలు

ఆమనగల్లు: పురపాలక సంఘంలో కుక్కల బెడద పెరిగిపోయింది. గుంపులుగా సంచరిస్తూ భయాందోళనకు గురిచేస్తున్నాయి. బాటసారులపై అకారణంగా దాడులకు పాల్పడుతున్నాయి. ద్విచక్రవాహన దారులను వెంబడిస్తూ ప్రమాదాల బారిన పడేస్తున్నాయి. దీంతో ప్రజలు బయటకు రావాలంటే జంకుతున్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధి ఉదయనగర్, ఆదర్శనగర్ కాలనీలలో గ్రామ సింహాలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఎవరు కంట పడినా గుర్రుమంటూ ఓరగా చూస్తున్నాయి. హడలిస్తే దాడులకు పాల్పడుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంటినుంచి బయటకు రాలేకపోతున్నామని వాపోతున్నారు. ఇటీవల ఆదర్శనగర్ కాలనీకి చెందిన చిన్నారి రియాజ్‌ఖాన్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయని కాలనీ వాసులు తెలిపారు. వాటి భయంతో పిల్లలు ఆరు బయట ఆడుకోలేకపోతున్నారని, ఇంట్లోనే ఉండాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. కొంత కాలం క్రితం శునకాల నియంత్రణకు మున్సిపాలిటీ పాలకవర్గ సభ్యులు చర్యలు తీసుకున్నారని, అయినా పదుల సంఖ్యలో కాలనీలలో తిరుగుతున్నాయని చెప్పారు. అంతే కాకుండా పందులు కూడా పెరిగిపోయాయన్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు స్పందించి, కుక్కలు, పందుల బెడద నుంచి కాపాడాలని పుర ప్రజలు కోరుతున్నారు. ఇదే విషయమై కమిషనర్ శంకర్‌నాయక్‌ను వివరణ కోరగా.. వీధి కుక్కల బెడద గురించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని పేర్కొన్నారు. అనంతరం వారి ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూస్తామన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న నూతన అధ్యక్షుడు రాంరెడ్డి

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌లోని స్నేహపురి కాలనీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం జరిగిన కాలనీ అధ్యక్ష ఎన్నికల్లో మొత్తం 125 ఓట్లకు.. గంగిడి రాంరెడ్డికి 73, కట్టా అచ్యుత రెడ్డికి 52 ఓట్లు వచ్చాయి. దీంతో 21 ఓట్ల మెజార్టీతో గంగిరెడ్డి గెలిచి, అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టారు. ప్రధాన కార్యదర్శిగా తంగెళ్ల సతీష్ చారి, గౌరవ సలహాదారుగా వడ్ల భాస్కర్ చారి, చీఫ్ కో– ఆర్డినేటర్ ఆలేటి మల్లేశం, ఉపాధ్యక్షులుగా ఎడ్ల గౌరి శంకర్, పి.శ్రీపాల్, పి.తిరుపతయ్య, కార్యదర్శులుగా శ్రీనివాస చారి, యాదగిరి, మురళీ మోహన్, కోశాధికారిగా శ్రావణ్ కుమార్, సహ కోశాధికారిగా మహిపాల్ రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా రాజు గౌడ్, శ్రీనివాస్, ఐలయ్య, శాంత కుమారి, కార్యనిర్వాహక సభ్యులుగా చంద్రశేఖర్ రెడ్డి, సురేంద్ర, రామకృష్ణా రెడ్డి, శ్రీనివాస్, మురళీ, శ్రీనివాస్ రెడ్డి, అహ్మద్ బాష, కల్పన, అన్నపూర్ణ, సుచరితను ఎన్నుకున్నారు. అనంతరం నూతన సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం



విద్యార్థులతో కరాటే మాస్టర్లు, నాయకులు

చేవెళ్ల: కరాటే ఆత్మరక్షణతో పాటు శారీర దృఢత్వానికి దోహదపడుతుందని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. మండల కేంద్రంలోని స్పోర్ట్స్ స్టేడియంలో ఆదివారం జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో కరాటే మాస్టర్ కె.కృష్ణ నిర్వహించిన కరాటే శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా కరాటే బెల్టుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన వారికి బెల్టులు ప్రదానం చేశారు. అనంతరం శిక్షణ అందించిన మాస్టర్ కృష్ణను అభినందించారు. కార్యక్రమంలో కరాటే బెల్ట్‌ల చీఫ్ ఎగ్జామినర్, 8వ బ్లాక్ బెల్టు డాన్ ఎండీ ఖాజాపాషా, ఆర్గనైజర్లు బ్లాక్ బెల్టు డాన్‌లు జంగయ్య, రాములు, యూత్ కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

పొదుపుతోనే ఆర్థిక స్వావలంబన

పొదుపు సంఘం అధ్యక్షుడు రవికుమార్



వార్షిక సభలో పాల్గొన్న భక్త మార్కండేయ, పొదుపు సంఘం సభ్యులు

మహేశ్వరం: చిన్న, మొత్తాల పొదుపు ఆర్థిక స్వావలంబనకు దోహదపడుతుందని శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి పొదుపు సంఘం అధ్యక్షుడు మన్న రవికుమార్ అన్నారు. సంఘం 20వ వార్షిక మహాసభను జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరామ కాలనీలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్త మార్కండేయ స్వామికి పూజలు చేశారు. 20 ఏళ్లలో సంఘం సాధించిన పురోగతిపై సభ్యులు చర్చించారు. ప్రస్తుతం 720 మందితో కొనసాగుతున్న సంఘంలో పొదుపు సంబంధించి పూర్తి పారదర్శకతను పాటిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడితో పాటు ఉపాధ్యక్షుడిగా ఒగ్గు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా భీమనపల్లి వెంకటేశ్, కోశాధికారిగా కెంచె శ్రీకాంత్, సహాయ కార్యదర్శిగా వున్న విష్ణు, సభ్యులుగా భిక్షపతి, శ్రీనివాస్, రమ్య, గుర్రం నరేశ్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో సంఘం వ్యవస్థాపకుడు గుర్రం శ్రీనివాస్, వినాయక పొదుపు సంఘం అధ్యక్షుడు కెంచె లక్ష్మీనారాయణ సంఘం సభ్యులకు సలహాలు, సూచనలు చేశారు.

ఉన్నత విద్యనందించడం అభినందనీయం



జ్ఞాపికలు అందజేస్తున్న పాఠశాల సిబ్బంది

నాగోలు: విద్యార్థులకు ఉత్తమ శిక్షణ, విద్యనందిస్తూ వారిని ఉన్నత స్థానాల్లో నిలుపుతున్న రేయాన్ సైనిక్ స్కూల్స్ యాజమాన్యం నిబద్ధతను అభినందించాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు పేరాల శేఖర్‌జీ అన్నారు. ఆలిండియా సైనిక్ స్కూల్–2025 ఫలితాలలో 6, 9వ తరగతి ప్రవేశ పరీక్షల్లో మొదటి ర్యాంక్, 4వ ర్యాంక్‌లతో పాటు అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థుల సక్సెస్ మీట్‌ను ఆదివారం నాగోలులోని రేయాన్ సైనిక్ స్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి పరీక్షలలో విజయం సాధించిన హసీశ్‌రెడ్డి, అమృత్ యాదవ్, శ్రీతేజ, సాకేత్, దీక్షత్‌రాజ్‌రెడ్డి, అక్షిత్‌రెడ్డి, అకున్ బాలాజీ, భానుప్రసాద్‌తో పాటు 260పైగా మార్కులు సాధించిన 45 మందిని సన్మానించారు. అదేవిధంగా 9వ తరగతి ప్రవేశ పరీక్షా ఫలితాల్లో ప్రతిభ చూపిన అశ్వర్థా, ఎన్‌డీఏకు ఎంపికైన జాన్సన్, రూపేశ్, జయంత్, అభిరామ్, రఘునందన్, ప్రణవ్‌లను బీజేపీ జాతీయ నాయకులు శేఖర్‌జీ, స్కూల్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, డైరెక్టర్ ఉమాదేవి అభినందించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. రేయాన్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకున్నారన్నారు. గత 25 సంవత్సరాలుగా ఎందరో విద్యార్థులు వివిధ రంగాల్లో స్థిరపడ్డారని, సివిల్ సర్వెంట్స్‌గా, ఇంజనీరింగ్, మెడికల్ విభాగాలు, ఎన్‌డీఏలో అవకాశాలు లభించాయన్నారు. రేయాన్ డైరెక్టర్ ఉమారెడ్డి మాట్లాడుతూ.. చిన్నారులకు విద్యతో పాటు సామాజిక అవగాహన, ఉన్నతమైన విలువలు నేర్పుతున్నామని స్పష్టం చేశారు.

బహుమతుల ప్రదానం



విజేతలతో దీప్తిరెడ్డి, గురుసాయిదత్త, శ్రీనివాసరావు

మలక్‌పేట: రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విక్రాంత్ బ్యాడ్మింటన్ అకాడమీలో నాలుగు రోజుల పాటు జరిగిన జిల్లా బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్–2025 పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంతర్జాతీయ మాజీ క్రీడాకారిణి, గోపిచంద్ అకాడమీ కోచ్ దీప్తిరెడ్డి, అంతర్జాతీయ మాజీ క్రీడాకారుడు, అంతర్జాతీయ కోచ్ గురుసాయిదత్త ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీలలో1000 మంది క్రీడాకారులు పాల్గొన్నారని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కరెడ్ల శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పి. ఆనంద్‌బాబు, సంయుక్త కార్యదర్శి సాయిరెడ్డి, మాజీ కార్పొరేటర్ సామా ప్రభాకర్‌రెడ్డి, బీఏటీ సంయుక్త కార్యదర్శి యూబీఎస్‌బాబు, రవణారెడ్డి పాల్గొన్నారు.

మీనం 'బంగారం'



కడ్తాల్: చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు



ఆమనగల్లులో చేపలు కొనుగోలు చేస్తున్న జనం



ఇబ్రహీంపట్నం: మార్కెట్‌లో చేపలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

మృగశిర కార్తె సందర్భంగా చేపలకు భారీ డిమాండ్ ఏర్పడింది. కార్తె ప్రారంభం రోజున చేపలను ఆరగించడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో ఆదివారం ఆమనగల్లు, ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతాల్లో విక్రయాలు జోరుగా సాగాయి. ఇదే అదనుగా భావించిన వ్యాపారులు ధరలు అమాంతం పెంచేశారు. బంగారు తీగలు, రవ్వలు కిలో రూ.200, బొచ్చలు కిలో రూ.300లు, కొరమీను(కొర్రమట్ట) రూ.1500లకు పైగా ధర పలికింది. సాధారణ రోజుల్లో కంటే రెట్టింపు రేటు పలికినా.. కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపారు. చికెన్, మటన్ దుకాణాల్లోనూ సందడి నెలకొంది.

–సాక్షి, నెట్‌వర్క్



యాచారం: మాల్ మార్కెట్లో..



ఇబ్రహీంపట్నంలో..



ఇబ్రహీంపట్నంలో..

గిరిజనులను మోసం చేసిన ప్రభుత్వం

కడ్తాల్: కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులను అన్ని విధాలుగా మోసం చేసిందని లంబాడ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్)రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్‌నాయక్ ఆరోపించారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి గిరిజన సదస్సుకు ఆయన హాజరు కాకుండా, పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా దశరథ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్.. లంబాడాలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని, మాయ మాటాలతో మభ్యపెట్టి మోసం చేసిందని విమర్శించారు. ఇచ్చిన మాటను నిలుపుకొనే వరకు పోరాటం చేస్తూనే ఉంటామని పేర్కొన్నారు. అరెస్టులతో ఉద్యమాలను అణచివేయాలని చూస్తే సహించేది లేదని, పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

కడ్తాల్: కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని, అది మంత్రి వర్గ విస్తరణ ద్వారా మరోసారి నిరూపితమైందని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ ఆలోచనల మేరకు రాష్ట్రంలో ప్రజాపాలన ప్రభుత్వం.. సామాజిక న్యాయానికి ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. ఈ సందర్భంగా మంత్రి వర్గంలో నూతనంగా చోటు దక్కించుకున్న ఎమ్మెల్యేలు వివేక్, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్‌లతో పాటు, డిప్యూటీ స్పీకర్‌గా ఎంపికైన రాంచంద్రునాయక్‌లకు శుభాకాంక్షలు తెలిపారు.

వర్షం వస్తే బురద.. ఆరితే దుమ్ము

యాచారం: వర్షం వస్తే బురద. అది ఆరితే దుమ్ముధూళి. ఇదీ మాల్ కేంద్రంలోని సాగర్ రోడ్డుపై దుస్థితి. దీని కారణంగా తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇది వాహనదారులకే కాదు.. స్థానికులను తీవ్ర కలవర పెడుతోంది. మాల్ కేంద్రం సమీపంలోనే ఓ వ్యాపారి ఎత్తైన గుట్టపై వెంచర్ వేశారు. అక్కడ డ్రైనేజీ వ్యవస్థ నిర్మించలేదు. దీంతో వాన పడిన ప్రతిసారి గుట్టపై నుంచి వరద, దానికి మట్టితోడై ఇలా బురదగా కింద ఉన్న రోడ్డుపైకి చేరుతుంటుంది. ఇది ప్రమాదాలకు దారి తీస్తుంటుందని, వరద ప్రభావం తగ్గాకా.. దుమ్ముధూళితో మరింత ఇబ్బంది పడాల్సి వస్తుందని స్థానికులు పేర్కొంటున్నారు. పంచాయతీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. తాజాగా ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి కొట్టుకొచ్చిన మట్టితో పలువురు వాహనదారులు కిందపడి గాయాల పాలయ్యారని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, వెంచర్ నిర్వాహకులు డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



గుట్టపై నుంచి మాల్ సాగర్‌రోడ్డుపైకి చేరిన బురద నీరు

16వ మహాసభలను విజయవంతం చేయండి

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి

చేవెళ్ల: సీపీఐ పార్టీ మండల 16వ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. పార్టీని బలోపేతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. మండల కేంద్రంలోని సీపీఐ కాలనీ పేజ్–2 వద్ద ఈ నెల 10వ తేదీన పార్టీ మండల 16వ మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభలకు జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో నూతన మండల కమిటీని ఎన్నుకోవటంతో పాటు భవిష్యత్తు పార్టీ కార్యాచరణ ప్రకటిస్తుందని స్పష్టం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల నాయకులు కార్మికులు, కర్షకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు ఎం.ప్రభులింగం, సుభాన్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, సత్యనారాయణ, మక్బుల్ తదితరులు పాల్గొన్నారు.